# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 12, జులై 2026


## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ప్రత్యేక దృష్టి

✪ బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించాలి: నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

✪ సోన్, లక్ష్మణచందా మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

నిర్మల్, జులై 11, ప్రభాతవార్త:

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సోన్, లక్ష్మణచందా మండలాల్లో పర్యటించి, జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణకు సంబంధించిన మిగతా 2లో..



# సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

✪ రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కెరమెరి, జూలై 11, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, పేదల గృహ నిర్మాణం వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, వాంకిడి మండలం కోమటిగూడ గ్రామాలలో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించడం జరిగిందని, ఈ భవనాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీలు గ్రామాల అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారాలని, ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో



10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను మిగతా 2లో..

# భూముల పునఃసర్వేను పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలి

✳ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ✳ జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం

✳ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఖచ్చితమైన భూ రికార్డులే ప్రభుత్వ లక్ష్యం

మంచిర్యాల, జూలై 11, ప్రభాతవార్త:

రాష్ట్రంలో భూముల పునఃసర్వే కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకతతో, ఖచ్చితత్వంతో నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన దృశ్య సమీక్ష సమావేశంలో ఆయన భూముల పునఃసర్వే, భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ, విద్యార్థులకు దుస్తుల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పటాలు అందుబాటులో లేని గ్రామాలకు శాశ్వత భూ రికార్డులు రూపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర భూముల పునఃసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉపగ్రహ ఆధారిత సర్వే పరికరాలు, డిజిటల్ పటాల రూపకల్పన విధానాలను వినియోగిస్తూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియలో ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని, అవసరమైన చోట వెంటనే నిర్ణయాలు మిగతా 2లో..




## ఎస్.ఐ.ఆర్ ను పకడ్బందీగా నిర్వహించాలి

✧ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



తాండూర్, జూలై 11, ప్రభాతవార్త :

భారత ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఐ.ఆర్ ను బి.ఎల్.ఓ, బి.ఎల్.ఎ లు పగడ్బందీగా నిర్వహించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు. తాండూర్ గ్రామ పంచాయతీ పరిధి ఐబీలోని సుభద్ర కాలనీలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ నమోదును ప్రక్రియను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో అమూల్యమైనద న్నారు. ఎస్.ఐ.ఆర్ పత్రాల నమోదును సమగ్రంగా పరిశీలించాలని, ఓటర్ల కొత్త ఫొటోలు అతికించాలన్నారు. ఎస్.ఐ.ఆర్ ఫారం నింపే ఓటర్లకు ఏమైనా సమస్యలు వస్తే సంబంధిత అధికారుల మిగతా 2లో..

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఫారమ్‌లను సేకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వాటిని వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. రోజువారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం లక్ష్మణచందా మండలం పార్‌పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం ఓటర్ల సంఖ్య, పంపిణీ చేసిన ఫారమ్‌లు, ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని, తప్పులు లేని జాబితా రూపకల్పనకు కృషి చేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్లు సంతోష్, సరిత, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకలకు అనుగుణంగా ఎస్.ఐ.ఆర్‌ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ పేరును జాబితా నుంచి తొలగిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు మీద ఉందన్నారు. గ్రామీణ ఓటర్లకు విద్యా వంతులు ఎస్.ఐ.ఆర్ నమోదుకు సహకరించాలని కోరారు. చిన్నారికి పోలియో చుక్కల మందును ఎంపీ వేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రఘునథ్ రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు ఈసా, నాయకులు తాళ్లపల్లి శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## భూముల పునఃసర్వేను పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామస్థులకు పునఃసర్వేపై పూర్తి అవగాహన కల్పించి, వారి సందేహాలు, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. సమగ్ర పునఃసర్వే పూర్తయిన అనంతరం రాష్ట్రంలో భూ రికార్డులు మరింత ఖచ్చితంగా సిద్ధమవడంతో భూ వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని, శిక్షణ పొందిన ఐదు వేల ఏడు వందల మంది అనుమతిపొందిన సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సాధారణ సర్వేయర్లు, అనుమతిపొందిన సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన పునఃసర్వే ద్వారా భూ సమస్యల్లో అధిక శాతం పరిష్కారమయ్యాయని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, భూముల పునఃసర్వే, భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తదితర ప్రభుత్వ కార్యక్రమాలను నిబంధనల మేరకు అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### - సర్పంచ్ సిరం సుష్మారెడ్డి

**భైంసా, జులై 11, ప్రభాతవార్త:**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై అర్హులైన వారందరికీ ఓటు హక్కు నమోదు చేయించాలని భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు, దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి కోరారు. శనివారం భైంసా మండలంలోని మీర్జాపూర్, సిద్దూర్, మహాగాం, వానల్‌పాడ్, తిమ్మాపూర్, మాటేగాం, కోతుల్‌గాం, చింతల్‌బోరి, ఇలేగామ్, వలెగాం, కామోల్‌తో పాటు పలు గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున నియమితులైన బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్‌ఏలకు) ఐడెంటిటీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సిరం సుష్మారెడ్డి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలోని లోపాలను సవరించడానికి, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఓటు నమోదు, సవరణల విషయంలో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, ఈ ప్రక్రియను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా వలసవాదులను గుర్తించడానికి, బోగస్ ఓట్లను ఓటరు జాబితా నుండి శాశ్వతంగా తొలగించడానికి ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొని ఓటర్లకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, బీఎల్‌ఏలు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఆకాష్, ప్రముఖ నాయకులు పోల్కం సాయినాథ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటిపేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన పోడు రైతులు తాతముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సాగు భూములలోకి వెళ్లకుండా పోలీసుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందిస్తూ 2005 సంవత్సరానికి ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. అదే సమయంలో కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తూ పోడు సాగు చేయకూడదని, పోడు భూములకు సంబంధించిన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని చట్టాలకు సంబంధించినదని, గిరిజనేతర రైతుల సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుర్దాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగుకు అనుకూలమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూములు, ఆస్తులు శాశ్వతం కావని, పిల్లలే మనకు నిజమైన ఆస్తిఅని, వారిని బాగా చదివించి ఉన్నత స్థానాలలో నిలబెట్టడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, మహిళల సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడితే సహించేది లేదు

**- టీచర్ల సెలవుతో అటెండర్ పాఠాలు చెప్పడం దురదృష్టకరం**

**- శీతల్కర్ అరవింద్ బాధ్యులైన ఉపాధ్యాయులు, నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**భైంసా, జులై 11, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని అంతర్ని ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేసారి సెలవులో ఉండటంతో విద్యార్థులకు అటెండర్ పాఠాలు బోధించిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఛాత్ర యువ సంఘర్ష సమితి (సీవైఎస్ఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ పేర్కొన్నారు. శనివారం ఆయన భైంసాలో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం విద్యాశాఖ నిరక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులు సెలవులో ఉంటే ప్రత్యామ్నాయంగా వెంటనే ఇతర ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఏర్పాటు చేయాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందన్నారు. అలా కాకుండా అటెండర్‌తో విద్యార్థులకు పాఠాలు చెప్పించడం విద్యా ప్రమాణాలను దెబ్బతీసే చర్య అని దుయ్యబట్టారు. కుబీర్ మండలంలో కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే హాజరు (ఎఫ్ఆర్ఎస్) నమోదు చేసుకుని సొంత పనుల కోసం తిరుగుతున్నారని, విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడుతున్నా మండల విద్యాధికారి తనకేం పట్టనట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. బడికి పోని బడిపంతుల వ్యవహారం గత దశాబ్ద కాలంగా కుబీర్ మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్నా ఇక్కడి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ప్రభుత్వ పాఠశాలపై పర్యవేక్షణ పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యతో రాజీ పడకుండా విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శీతల్కర్ అరవింద్ హెచ్చరించారు.

## పంచాయతీ నిర్వహణకు కొత్త విధివిధానాలు

### - పద్మశాలి సేవా సంఘం సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవనంలో శనివారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గుల్లపెల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వడ్నాల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పంచాయతీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పంచాయతీల నిర్వహణ విధానం, పాటించాల్సిన నిబంధనలు, పారదర్శకత, క్రమశిక్షణ తదితర అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. పంచాయతీల్లో పాల్గొనే ఇరువర్గాల నుంచి ముందస్తుగా డిపాజిట్ స్వీకరించి, నిర్ణీత విధివిధానాల ప్రకారం నిష్పక్షపాతంగా పంచాయతీలు నిర్వహించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సంఘం ప్రతిష్ఠను కాపాడేలా, ఇరువర్గాలకు న్యాయం జరిగే విధంగా పంచాయతీలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులంతా సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



## ఆర్జీయూకేటీ బాసర విద్యార్థినికి ప్రతిష్టాత్మక ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్

**- ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులకు ఎల్ఐసీ భరోసావిద్యార్థిని చవాన్ తపస్విని అభినందించిన వీసీ గోవర్ధన్, అసోసియేట్ డీన్ విటల్**

**భైంసా, జులై 11, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా బాసర రాజీవ్‌గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయంలో పీయూసీ1 చదువుతున్న విద్యార్థిని చవాన్ తపస్వి ప్రతిష్టాత్మకమైన "ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ (2025-26)" కు ఎంపికయ్యారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఉన్నత చదువుల దిశగా ప్రోత్సహించేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది. దేశవ్యాప్తంగా వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన అనంతరం, తపస్వి తన ప్రతిభతో ఈ స్కాలర్‌షిప్ తుది ఎంపికకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. విటల్ లు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. తపస్వి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని, మరెన్నో విజయాలు సాధించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్జీయూకేటీ విద్యార్థిని జాతీయ స్థాయిలో ఈ ప్రతిభ కనబరచడం పట్ల విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు మరియు తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## జూలై 15 మహాధర్నాను విజయవంతం చేయాలి

**- బోడెంకి చందుఖాళీ ఉద్యోగాల భర్తీతో పాటు ఉద్యోగాల వార్షిక ప్రణాళిక విడుదల చేయాలని ప్రభుత్వాలకు డిమాండ్**

**మంచిర్యాల, జూలై 11, ప్రభాతవార్త:**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల వార్షిక ప్రణాళికను తక్షణమే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల హామీలు నెరవేర్చలేదని, రాష్ట్ర ప్రభుత్వం కూడా హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగాల భర్తీ చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నియామక ప్రకటనలు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న వెనుకబడిన వర్గాల ఉద్యోగాలను భర్తీ చేయాలని, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 15న జరిగే మహాధర్నాలో యువత, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోమాస ప్రకాష్, కె. ప్రేమ్ కుమార్, అరిగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

## మూడు రోజుల్లో మిస్సింగ్ కేసు ఛేదన

వేమనపల్లి, జులై 11, ప్రభాతవార్త:

వేమనపల్లి మండలం కేతనపల్లి గ్రామానికి చెందిన వశాఖ నగేష్ కనిపించకుండా పోవడంతో నమోదైన మిస్సింగ్ కేసును నీల్వాయి పోలీసులు వేగంగా ఛేదించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చెన్నూరు రూరల్ సీఐ ఆర్. కృష్ణ ఆదేశాలపై ఎస్సై కే. జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నగేష్ ప్రయాణించిన మార్గాన్ని గుర్తించారు. నిరంతర అన్వేషణ ఫలితంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు బృందం నగేష్‌ను సురక్షితంగా నీల్వాయికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించింది. తమ కుటుంబ సభ్యుడిని క్షేమంగా తిరిగి చేర్చిన పోలీసు అధికారులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజ్ కీలకంగా ఉపయోగపడుతున్నాయని రూరల్ సీఐ ఆర్. కృష్ణ తెలిపారు. ఎవరైనా వ్యక్తులు కనిపించకుండా పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

## అనారోగ్యంతో మున్సిపల్ ఉద్యోగి మృతి

చెన్నూరు, జులై 11, ప్రభాతవార్త:



మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో శానిటేషన్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ముజ్జు అనారోగ్యంతో శుక్రవారం రోజున మృతిచెందాడు. ముజ్జు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అటు మున్సిపల్ కార్యాలయంలోను సహచర ఉద్యోగులు ముజ్జు మృతిచెందాడన్న వార్త వినగానే కంటతడి పెట్టారు. తమతో కుటుంబ సభ్యునిగా ఉండేవాడని, ప్రతీ కార్యక్రమాన్ని ముందుండి నడిపించేవాడని గుర్తుచేసుకున్నారు.

## ప్యార్టీల ఆధిపత్యానికి ముగింపు పలికి బీసీలకు రాజ్యాధికారం కల్పించాలి

### - టికెట్లలో యాభై శాతం అవకాశం, కీలక పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేరం అలేఖ్య డిమాండ్

మంచిర్యాల,జులై 11, ప్రభాతవార్త:



దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పార్టీల రాజకీయాల కారణంగా ప్రజాస్వామ్యం పేరుకే పరిమితమైందని, రాజకీయ అవకాశాలు కొద్ది కుటుంబాలు, ధనబలం చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ప్రముఖ న్యాయవాది పేరం అలేఖ్య అన్నారు.రాష్ట్రంలో బీసీలు జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ శాసనసభ, మంత్రివర్గం, ఇతర కీలక పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగాలు, వ్యవసాయం, రాజకీయాలు తదితర అన్ని రంగాల్లో బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు.పార్టీల అభ్యర్థుల ఎంపికలో బీసీలకు యాభై శాతం అవకాశం కల్పించాలని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవుల్లో బీసీ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం బీసీల రాజకీయ సాధికారతకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# భూ సర్వే, రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి

### - కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి - వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష

నిర్మల్, జులై 11, ప్రభాతవార్త:




రాష్ట్రంలో భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాలకు మ్యాపులు సిద్ధం చేసేందుకే ఈ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి రీసర్వే నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. సర్వే, రీసర్వే పనులను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ల్యాండ్ సర్వేయర్ నరసింహమూర్తి తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలి

### - అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు

నిర్మల్, జులై 11, ప్రభాతవార్త:



ఖానాపూర్ పట్టణంలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను శనివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక అధికారులతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నమోదైన దరఖాస్తుల సంఖ్య, ఫారాల సేకరణ, ఆన్‌లైన్ నమోదు పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారములను సేకరించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అందిన ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా కొనసాగించాలని సూచించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బీఎల్ఓలు చురుగ్గా సహకారం అందించాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం ఫీల్డ్‌లోని బీఎల్ఓల పనితీరును సమీక్షించి, మరింత వేగంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసీల్దార్ సుజాత, ఇతర రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో శ్రమదానం చేసిన బెడద దశన్న.. యువకుల అభినందనలు

సారంగాపూర్, జులై 11, ప్రభాతవార్త



మండలంలోని కొట్ర (బి) గ్రామంలో వెలిసిన సాయిబాబా, దత్తాత్రేయ ఆలయ సమీపంలో ఉన్న గోమాతల మేత ప్రదేశాన్ని స్థానిక దాత బెడద దశన్న శనివారం శుభ్రం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న గోవుల కోసం దాతలు పశుగ్రాసాన్ని నిలువ ఉంచారు. అయితే, ఈ పశుగ్రాసాన్ని గోవులకు వేయడం కోసం సిమెంట్‌తో నిర్మించిన విశాలమైన ప్రదేశంలో చెత్తాచెదారం పేరుకుపోయింది.దీనివల్ల ఆలయ గోమాతలకు మేత వేయడం ఇబ్బందిగా మారిన విషయాన్ని గ్రహించిన బెడద దశన్న స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. తన సొంత ట్రాక్టర్ సహాయంతో దాదాపు గంటసేపు శ్రమించి అక్కడ పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించారు. గోవులకు ఇబ్బంది లేకుండా మేత వేయడానికి అనుకూలమైన సౌకర్యాన్ని కల్పించారు. గోమాతల సంరక్షణ కోసం ఉదారత్వంతో ముందుకు వచ్చి శ్రమదానం చేసిన దాత బెడద దశన్నను గ్రామ యువకులు అభినందిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ప్రారంభం

### - జూలై 11 నుంచి 18 వరకు కుటుంబ సంక్షేమం, కుటుంబ నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

మంచిర్యాల, జులై 11, ప్రభత్తవార్త:



ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నుంచి కుటుంబ సంక్షేమం, కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీని జిల్లా కార్యక్రమాల అధికారి డాక్టర్ అరుణశ్రీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 11 నుంచి 18 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. "పిల్లల మధ్య సరైన అంతరం ఉంటే కుటుంబం ఆరోగ్యం, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది" అనే నినాదంతో అర్హులైన దంపతులకు అవగాహన కల్పించాలని సూచించారు.కుటుంబ నియంత్రణలో తాత్కాలిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మహిళలకు నోటి మాత్రలు, గర్భనిరోధక సాధనాలు, ఇంజక్షన్లు, పురుషులకు శాశ్వత కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స వంటి సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార మాధ్యమాల అధికారి వెంకటేశ్వర్లు, ప్రచార బృందం సభ్యులు, నర్సింగ్ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా మంచిర్యాలలో సాదర స్వాగతం

మంచిర్యాల, జులై 11, ప్రభాతవార్త:



కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా డీసీపీ ఎ. భాస్కర్, ఆబ్కారీ మద్యనిషేధ శాఖ పర్యవేక్షకులు చాణక్య, సింగరేణి శ్రీరాంపూర్ ప్రాంత ప్రధానాధికారి శ్రీనివాస్ తదితరులతో కలిసి మంత్రికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలపై వారు సంక్షిప్తంగా చర్చించినట్లు అధికారులు తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


హాజరైన ప్రజలు

# ఓటర్ల జాబితా సవరణలో కాంగ్రెస్ శ్రేణులు చురుకుగా పనిచేయాలి

## - బీఎల్‌ఏలదే కీలక బాధ్యత ప్రత్యేక సవరణపై అవగాహన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

**ఆసిఫాబాద్, జూలై 11, ప్రభాతవార్త :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బిఎల్‌ఏ, కార్యకర్తలకు ఓటర్ల జాబితా సవరణపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అధ్యక్షత వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, తప్పుల సవరణలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ప్రత్యేక సవరణపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిరుపేద బిఎల్‌ఏలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సర్ పేరుతో కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం చేసే కుట్రలను తిప్పి కొట్టే బాధ్యత ప్రజలే తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ సర్ ను పూర్తిస్థాయిలో చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఏ లను ప్రత్యేకంగా నియమించిందని, వీరి ద్వారానే జిల్లాలో 56 ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హత కలిగిన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, బీఎల్‌ఏ ఇన్‌చార్జి రాంగోపాల్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల మంగ, కుడిమేత విశ్వనాథ్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని విశ్రాంత సింగరేణి ఉద్యోగుల వినతి

## - కోదండరామ్‌కు వినతిపత్రం అందజేయనున్న మంచిర్యాల జిల్లా సంఘం

**మంచిర్యాల, జులై 11, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సకల జనుల సమ్మెలో పాల్గొన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య కోరారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ పైన గల సమావేశ మందిరంలో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సమావేశానికి శాసన మండలి సభ్యుడు కోదండరామ్ హాజరవుతున్న సందర్భంగా ఆయనకు ఈ మేరకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులందరూ సమావేశానికి హాజరై ఐక్యతను చాటాలని వెంకటయ్య పిలుపునిచ్చారు.



# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ లీజు మంజూరు

## - సింగరేణిలో విజయోత్సవాలు

**బెల్లంపల్లి, జూలై 11, ప్రభాతవార్త:**

సింగరేణి సంస్థకు తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ లీజు మంజూరు కావడం సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో శనివారం విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ ముఖ్య అతిథిగా హాజరై, తాడిచర్ల-2 బ్లాక్ ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించారు. మన రాష్ట్రంలోనే సంస్థకు అందుబాటులోకి వచ్చిన జి9 నాణ్యత గల బొగ్గు బ్లాక్ అనుమతి సింగరేణి సంస్థ భవిష్యత్తు మనుగడను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. తాడిచర్ల-2 బ్లాక్ సాధనలో రాష్ట్ర ప్రభుత్వం, ట్రేడ్ యూనియన్లు కీలక పాత్ర పోషించాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశాన్ని ఉద్యోగులకు తెలియజేశారు. అనంతరం కరపత్రాలు విడుదల చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, అధికారుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఇంజినీర్ కృష్ణమూర్తి, ఇంచార్జి ఎస్ ఓ టు జిఎం ఎన్. ఉమాకాంత్, డీజీఎం (పర్సనల్) దేవరకొండ కిరణ్ బాబు, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్‌తో పాటు అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ సభను విజయవంతం చేయాలి

## - రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :**



హుస్నాబాద్ సభను విజయవంతం చేయాలి..గౌడ గీత కార్మికులకు న్యాయం చేయాలని సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసరి ఆంజనేయులు గౌడ్ అనానరఉ. శనివవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం గ్రామంలో గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) ఆధ్వర్యంలో గౌడ కులస్తులు, గీత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ జాతి, గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గీత కార్మికులకు తాటి చెట్లు వినియోగించుకునే అనుమతిపత్రాలను వెంటనే జారీ చేయాలని, దరఖాస్తు చేసిన వారికి 30 రోజుల్లోగా అనుమతులు అందించే విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనుమతులు లేక తాటి చెట్లపై నుంచి పడి మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం, బీమా, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల లైసెన్సుల్లో 50 శాతం గౌడ సమాజానికి కేటాయించాలని, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూమిని కేటాయించి తాటి, ఈత, ఖర్జూర తోటలను అభివృద్ధి చేయాలని, గీత కార్పొరేషన్‌కు రూ.5,000 కోట్లు కేటాయించి గీత కార్మికులకు ఆధునిక భద్రతా పరికరాలు, పనిముట్లు, ద్విచక్ర వాహనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కల్లు సహజ పానీయం కావడంతో దానిని ఆహార, పానీయాల శాఖ పరిధిలోకి తీసుకురావాలని, గీత కార్మికులపై పోలీసు, ఎక్సైజ్ శాఖల వేధింపులను నిలిపివేయాలని కోరారు. ప్రమాద బీమా, పెన్షన్, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు నీరా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించి గౌడ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత గౌడులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కోరారు. ఈ నెల 12న హుస్నాబాద్‌లో జరిగే గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి గౌడ సోదరులు, గీత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండ్ర మనోహర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ శంకర్ గౌడ్, ఈస్గాం గౌడ సంఘం అధ్యక్షుడు రంగు తిరుపతి గౌడ్, నాయకులు పూదరి తిరుపతి గౌడ్, రామా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కాగజ్‌నగర్-హౌరా కొత్త రైలు నడపాలి

## - కేంద్ర రైల్వే మంత్రికి ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు వినతి

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :**

సిర్పూర్ నియోజకవర్గ ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాగజ్‌నగర్ నుంచి హౌరా జంక్షన్ వరకు కొత్త రైలు సేవను ప్రారంభించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. హైదరాబాద్‌లో శనివారం నోవోటెల్ హోటల్‌లో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్ నుంచి హౌరా వరకు నేరుగా రైలు సేవ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో నివసిస్తున్న బెంగాలీ కుటుంబాలతో పాటు సాధారణ ప్రయాణికులకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. అలాగే సికింద్రాబాద్-నాగపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని, సిర్పూర్ టౌన్ రైల్వే స్టేషన్‌లో మరికొన్ని రైళ్లకు నిలుపుదల కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# యాదాద్రి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రమాణ స్వీకారం

**బెల్లంపల్లి, జూలై 11, ప్రభాతవార్త:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా నియమించిన నేపథ్యంలో, ఆయన యాదాద్రి దేవస్థానంలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నెన్నెల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రజలకు సేవ చేయడంతో పాటు దేవస్థాన అభివృద్ధికి విశిష్ట కృషి చేయాలని నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకాంక్షి ంచారు. ఆయన నియామకం దేవస్థాన అభివృద్ధికి తోడ్పడటమే కాకుండా ప్రాంత ప్రజలకు గౌరవాన్ని తీసుకువస్తుందని వారు పేర్కొన్నారు.





## ఘనంగా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

**తాండూర్, జూలై 11, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని దర్గా వద్ద హజరత్ మగ్దూం షాహిద్ బాబా, హజరత్ మక్కు షాహిద్ బాబాఉర్సు ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఐబి మసీదు నుండి దర్గా వరకు సందల్ ను ఊరేగించారు. కుమురభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి కరీంనగర్ జిల్లాలు, మహారాష్ట్ర నుండి భక్తులు ఉత్సవాలకు తరలివచ్చారు. దర్గాలోని మగ్దూం షాహిద్ బాబా, మక్కు షాహిద్ బాబా సమాధుల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కళాకారులు నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఏలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## సర్ ప్రక్రియను ముందుండి నడిపించాలి

### - భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :**

సర్ ప్రక్రియను ముందుండి నడిపించాలని బిజేపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, సిర్ జోన్-1 కన్వీనర్ జయశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదు గణన పత్రం నింపే ప్రక్రియలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కార్యకర్తలకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించాలని అన్నారు. పార్టీ శ్రేణులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేశ్వరరావు, వీరభద్రాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అరిగెల మల్లికార్జున్, కోవా విజయ్, అరుణ్ లోయ, కొప్పుల శంకర్, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ స్థాయి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీకి ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన అనంతరం తొలిసారిగా కాగజ్‌నగర్‌కు విచ్చేసిన జయశ్రీని భాజపా మాజీ జిల్లా అధ్యక్షుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత దంపతులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన పోరాటాలపై చర్చించారు. అనంతరం కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన డా. కొత్తపల్లి అనితను రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ సన్మానించారు.



భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీని సన్మానిస్తున్న డా.కొత్తపల్లి శ్రీనివాస్ డా. అనిత

# పీఆర్సీ అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

### - సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ టీఎస్ ధ్యేయం - జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు

### - మండలంలోని పలు పాఠశాలల్లో ఉధృతంగా సాగుతున్న సభ్యత్వ నమోదు

**భైంసా, జులై 11, ప్రభాతవార్త:**



ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ (వేతన సవరణ)ని త్వరలోనే సాధించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు చెప్పారు. శనివారం మండలంలోని మాలేగామ్, నిగవా, పల్సి, కుబీర్ పాటిల్ ప్రాథమిక పాఠశాలల్లో 2026 సంవత్సరానికి సంబంధించిన సంఘ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ టీఎస్ సంఘం ప్రధాన లక్ష్యమన్నారు. శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) పింగిలి శ్రీపాల్ రెడ్డి సహకారంతో రాష్ట్ర సంఘం ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సాధారణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అమలు చేయాల్సిన పీఆర్సీ.. ఎనిమిది సంవత్సరాలు గడిచినా అమలు కాకపోవడం దురదృష్టకరమని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి త్వరలోనే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించేలా, వచ్చే ఆగస్టు నెలలో నోటిఫికేషన్ విడుదల కోసం సంఘం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ఈ ప్రత్యేక టెట్ ఫలితాల అనంతరం బదిలీలతో కూడిన పదోన్నతులు (ప్రమోషన్లు) చేపట్టాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రాతినిధ్యం వహించామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు పరిచి, అన్ని రకాల పదోన్నతులను బదిలీలతో పాటే నిర్వహించేలా చూస్తామన్నారు.పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి:ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను సంఘం విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నెలకు రూ. 2 వేల కోట్ల చొప్పున విడుదల చేస్తోందని, దీనిని ఇలాగే కొనసాగించి వచ్చే మూడు నాలుగు నెలల్లో పెండింగ్ బిల్లులన్నీ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయుల హెల్త్ స్కీమ్‌ను కార్పొరేట్ ఆసుపత్రులలో నగదు రహితంగా (క్యాష్‌లెస్) అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనాభా గణన (సెన్సస్) విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యునరేషన్ విడుదలకు సంఘం చేసిన కృషి వల్ల ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘానికి మరింత బలం చేకూరాలంటే ప్రతి ఉపాధ్యాయుడు సంఘ సభ్యత్వం తీసుకోవాలని, ఈ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు ఎలా అరవింద్, ప్రధాన కార్యదర్శి షిండే దత్తాత్రి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఎస్టీయూ టిఎస్ ప్రధాన లక్ష్యం

### - రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్

### - ఎస్టీయూలో భారీగా ఉపాధ్యాయుల చేరిక

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 11, ప్రభాతవార్త :**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణే ఎస్టీయూ టిఎస్ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్ అన్నారు. తెలంగాణ పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటుకం మధుకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. తిరుపతితో పాటు వివిధ మండలాలకు చెందిన సుమారు 100 మంది ఉపాధ్యాయులు శనివారం ఎస్టీయూ తెలంగాణ రాష్ట్ర సంఘం (ఎస్టీయూటీఎస్)లో చేరారు. కాగజ్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్ వారికి సభ్యత్వ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సదానందం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణే ఎస్టీయూ ప్రధాన లక్ష్యమని అన్నారు. నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకంపై అనుమానాలు అవసరం లేదని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ (పీఆర్సీ)పై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి, 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేసి ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌పై వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించే అంశంపై విద్యాశాఖ కార్యదర్శితో చర్చిస్తామని చెప్పారు.సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, జాక్టో కో చైర్మన్ పర్వతి సత్యనారాయణ, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పుర్కా మాణిక్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ తుకారాం, సీనియర్ నాయకులు ఆరిఫొద్దీన్, జయప్రదతో పాటు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కుంగిపోయిన కల్వర్టు మరమ్మతు పనులు పూర్తి

### - ప్రజలకు అంకితం చేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్ సిమ్రాన్ కలీం

**బెల్లంపల్లి, జూలై 11, ప్రభాతవార్త:**

బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డులో చాలా కాలంగా దెబ్బతిని కుంగిపోయిన కల్వర్టు మరమ్మతు పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్ సిమ్రాన్ కలీం ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి, సంప్రదాయ పద్ధతిలో కొబ్బరికాయ కొట్టి కల్వర్టును ప్రజలకు అంకితం చేశారు. గత కొంతకాలంగా ఈ కల్వర్టు దెబ్బతినడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా అంతరాయం కలిగించే పరిస్థితులు నెలకొన్నాయి. సమస్య తీవ్రతను గుర్తించిన కౌన్సిలర్ సిమ్రాన్ కలీం వెంటనే స్పందించి, సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి మరమ్మతు పనులను వేగవంతం చేయించారు. అత్యవసరంగా చేపట్టిన ఈ పనులు సమయానికి పూర్తి కావడంతో, ప్రస్తుతం ప్రజలకు సురక్షితమైన రాకపోకలు అందుబాటులోకి వచ్చాయి. కల్వర్టు పునరుద్ధరణతో వార్డు ప్రజల దైనందిన జీవన విధానంలో గణనీయమైన మార్పు ఏర్పడింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ సిమ్రాన్ కలీం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం మా బాధ్యత. కల్వర్టు మరమ్మతు పూర్తవడంతో ఇకపై వర్షాకాలంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు సురక్షితంగా ప్రయాణించగలరు. వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి కొనసాగిస్తాము అని తెలిపారు. స్థానిక ప్రజలు తమ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు కౌన్సిలర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వార్డు అభివృద్ధికి ఆమె తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బస్తి పెద్దలు పులిపాక మోహన్, ఇల్లా భూమయ్య సాహిల్, సత్యనారాయణ గౌడ్, పోషం పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ కార్యకర్తలు బోగే అనిల్, ఖలీమ్, జమ్మికుంట రాజు, ముబీన్, పవన్, గోపి, రమాకాంత్, సునీల్, శేఖర్, జమీర్, మల్లేష్ తదితరులు హాజరయ్యారు. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం, వార్డు అభివృద్ధే మా ధ్యేయం అని కౌన్సిలర్ సిమ్రాన్ కలీం స్పష్టం చేశారు.



# రక్తదానం.. ప్రాణాలను కాపాడే గొప్ప సేవ..

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు - మంచిర్యాలలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం

- రక్తదాతలకు ధృవపత్రాల అందజేత, నిర్వాహకులకు అభినందనలు

**మంచిర్యాల, జూలై 11, ప్రభాతవార్త:**


రక్తదాన శిబిరంలో పాల్గొన్న శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్‌లో మంచిర్యాల క్లబ్ ఆధ్వర్యంలో, భారత రెడ్‌క్రాస్ సంఘం మంచిర్యాల జిల్లా శాఖ సహకారంతో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు రక్తదాన ధృవపత్రాలను ఎమ్మెల్యే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రక్తదానం అనేది అత్యంత గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్న అనేక మంది రోగులకు రక్తదాతల సేవలు ప్రాణదానంతో సమానమని అన్నారు. సమాజంలో సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న మంచిర్యాల క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, స్థానిక కార్పొరేటర్ సాయినీ స్రవంతి-కిషోర్, క్లబ్ అధ్యక్షుడు వెంకట రమణారావు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, కోశాధికారి నర్సింగరావు, ఉపాధ్యక్షులు జితేందర్ రావు, కొత్త రాజేశం, శశిపాల్ రెడ్డి, కార్యదర్శులు వడ్డే రాజమోళి, జుర్రు నాగేష్, కల్వల జగన్మోహన్ రావు, నల్ల శ్రీనివాస్, క్రీడా కార్యదర్శి సత్యపాల్ రెడ్డి, నాయకులు, క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటింటి ఓటరు నమోదు, డిజిటలైజేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్ కే శ్యాంసుందర్

**బజార్‌హత్నూర్, జులై 11, ప్రభాతవార్త:**



ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతంగా, పకడ్బందీగా కొనసాగించాలని తహసీల్దార్ కే శ్యాంసుందర్ బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు) సూచించారు. ఓటరు జాబితా పారదర్శకత కోసం బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి చేస్తున్న డిజిటలైజేషన్ విధానాన్ని, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను శనివారం ఆయన పలు గ్రామాల్లో స్వయంగా పరిశీలించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటర్లు తమ యొక్క, తమ కుటుంబ సభ్యుల పేర్లను పాత ఓటరు జాబితాలో సరిచూసుకోవాలని కోరారు. జాబితా సవరణ సమయంలో ఎవరూ తప్పుడు సమాచారాన్ని ఇవ్వవద్దని, ఎన్నికల సంఘం కల్పిస్తున్న ఈ ఎస్.ఐ.ఆర్ సేవలను గ్రామీణ ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా బీఎల్ఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ ఐ) నూర్ సింగ్, స్థానిక గ్రామ సర్పంచ్ మెస్రం మాధవ్, జీపీఓలు, బూత్ స్థాయి అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్ విడుదల చేసేదెప్పుడో..?

- ఉద్యోగాల భర్తీపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి - బీఆర్ఎస్ జిల్లా సోషల్ మీడియా నాయకులు మజర్

**బజార్‌హత్నూర్, జులై 11, ప్రభాతవార్త:**




తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు భారీ హామీలు ఇచ్చి, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు నిరుద్యోగులను ఘోరంగా మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా నాయకులు మజర్ విమర్శించారు. శనివారం ఆయన బజార్‌హత్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో శాఖల వారీగా ఖాళీలను గుర్తించి, నిర్ణీత కాలవ్యవధిలో ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని మజర్ గుర్తు చేశారు. యువత ఓట్లను ఆకర్షించడానికి కాంగ్రెస్ అగ్ర నేతలు సైతం వచ్చి, తమ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి క్యాబినెట్‌లోనే పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరియు ప్రత్యేక విభాగాల ద్వారా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి ప్రచారం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగం రావాలంటే కేసీఆర్ ఉద్యోగం పోవాలంటూ యువతను పక్కదోవ పట్టించి ఓట్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటివరకు అధికారిక టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ప్రకారం కేవలం 1,019 ఉద్యోగాలకు మాత్రమే కొత్త నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. మరి గత రెండున్నరేండ్లలో దాదాపు 20 నుండి 25 క్యాబినెట్ సమావేశాలు జరిగినా, నిరుద్యోగ యువత సమస్యలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు చూపిన స్పష్టమైన జాబ్ క్యాలెండర్ తరహాలో ప్రతి శాఖకు సంబంధించిన నోటిఫికేషన్ల పూర్తి వార్షిక షెడ్యూల్‌ను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మజర్ విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 16,978 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్లు విడుదల చేశామని అసెంబ్లీ నివేదికలో చూపించారని, కానీ ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం తాము 60 వేల నుండి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని రాజకీయ ప్రసంగాల్లో అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రక్రియను పూర్తి చేసి నియామక పత్రాలు అందజేస్తూ, తామే ఉద్యోగాలు ఇచ్చామని డబ్బా కొట్టుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన కొత్త నోటిఫికేషన్ల జీవో కాపీలతో పాటు వాస్తవంగా రాష్ట్రంలోని ప్రతి శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఇప్పటివరకు ఎన్ని కొత్త నోటిఫికేషన్లు జారీ చేశారు? ఎన్ని పోస్టులు భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీలు మిగిలి ఉన్నాయి? అనే వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, స్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, మిగిలిన ఖాళీల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు జారీ చేయాలని మజర్ ప్రభుత్వాన్ని కోరారు.



# నిర్మల్‌లో ఘనంగా తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్

- క్రీడాకారులకు ఆధునిక శిక్షణ, ఫిట్‌నెస్‌పై నిపుణుల అవగాహన

- పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు

**నిర్మల్, జూలై 11, ప్రభాతవార్త:**

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న వినూత్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆదేశాలు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచనల మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లాలోని క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు), కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు) పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధునిక శిక్షణా విధానాలు, ఫిట్‌నెస్ మెలకువలు, స్పోర్ట్స్ సైన్స్, క్రీడాకారులకు అవసరమైన పోషకాహారం, ఆటల సమయంలో జరిగే గాయాల నివారణ తదితర కీలక అంశాలపై క్రీడా నిపుణులు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను మరింత మెరుగుపరిచేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, యువత అభివృద్ధికి అనేక నూతన పథకాలను అమలు చేస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారులు వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఉప సంచాలకులు సుజాత, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, వైఐపీఈఎస్‌యూ జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, కోచ్‌లు ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక పరిశీలన ప్రక్రియలో రాష్ట్రంలోనే మంచిర్యాల నియోజకవర్గం తొలి స్థానంలో నిలవాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

- కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం

- ఈ నెల 24వ తేదీ వరకు సమిష్టిగా పనిచేయాలని పిలుపు

**మంచిర్యాల, జూలై 11 ప్రభాతవార్త:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులో ఉన్న మినీ పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక పరిశీలన ప్రక్రియపై కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ప్రత్యేక పరిశీలన ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా మంచిర్యాల నియోజకవర్గం తొలి స్థానంలో నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24వ తేదీ వరకు ప్రజలతో సమన్వయం చేసుకుంటూ, అధికారులు సూచించిన విధంగా ప్రక్రియను విజయవంతం చేయాలని కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమిష్టి కృషితో లక్ష్యాన్ని సాధించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు కొండ శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, సహనియుక్త సభ్యులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు